క్లుప్తంగా

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు భోజనం అందిస్తున్న వైద్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

శింగనమల: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు శంకర్ నాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని తరిమెల పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణుల మూడు నెలలోనే వైద్య సిబ్బంది వద్దకు వెళ్లి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులను వాడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రల్లో అందించే పోషకాహారం, గుడ్లు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలకు వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, మారుతి, చెన్నయ్య, హరి, కుమార్, రమేష్ కుమార్ భోజనం అందజేశారు.

ప్రభుత్వాస్పత్రి అద్దాల ధ్వంసం

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. ఆస్పత్రికి ట్రీట్‌మెంట్ కోసం వచ్చిన వారే మద్యం మత్తులో అద్దాలను ధ్వంసం చేశారని వైద్యులు తెలిపారు. సుమారు రూ. 15 వేల దాకా నష్టం వాటిల్లిందన్నారు. ఘటనపై ఆస్పత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ ఎల్లప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

40 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు జగదీష్

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 40 మందికి తాడిపత్రి షబానా కంటి వైద్యశాల వైద్యుడు జగదీష్ కంటి పరీక్షలు చేసి, 15 మందిని ఆపరేషన్లకు ఎంపికచేశారు. వారికి కర్నూలులోని రమేష్ ఆస్పత్రిలో ఆపరేషన్లు చేస్తామని వైద్యుడు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు భారత్ గ్యాస్ ఏజెంట్ ఆర్.వీరారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు వాయిదా

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 10న నిర్వహించాల్సిన హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఈఓ కె.వాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే హుండీ కానుకల లెక్కింపు తేదీని తెలియజేస్తామన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్ కార్డులివ్వాలి



కౌలురైతులను ఆదుకోవాలని వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పామిడి: మండలంలోని గజరాంపల్లిలో సర్వేనెంబర్ 296లో గత 20 ఏళ్ళుగా సాగులో ఉన్న రైతులందరికీ సీసీఆర్ కార్డులు మంజూరు చేయాలని ఏపీ రైతుసంఘం నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, ముత్యాలు, మల్లేసు డిమాండ్ చేశారు. సోమవారం వారు గ్రీవెన్స్‌లో తహసీల్దార్ ఎస్.శ్రీధరమూర్తికి వినతి పత్రం సమర్పించారు. కౌలురైతులకు రూ.20వేలు పెట్టుబడిసాయంతో పాటు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందజేయాలన్నారు. అలాగే ఆత్మహత్యలకు పాల్పడ్డ కౌలురైతుల కుటుంబాలకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. అలాగే మండలంలో భూ, ఇతరత్ర సమస్యలకు సంబంధించి ప్రజలు పలు అర్జీలను సమర్పించారు.

కనంపల్లిలో 28 మందిపై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లిలో ఆదివారం రాత్రి టీడీపీకి చెందిన ఇరు వర్గాల ఘర్షణకు సంబంధించి 28 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ ప్రసాద్ వర్గంలో 9 మంది, రాము వర్గంలో 19 మందిపై ఎస్సీ, ఎస్టీ, ఘర్షణ కేసులు నమోదు చేశామన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి రూరల్ పరిధిలోని సజ్జలదిన్నె, వరహాల తోట పెన్నానది పరిసరాల్లో సోమవారం అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న ఐదు ట్రాక్టర్‌లను శాండ్ టీం సిబ్బంది సీజ్ చేసింది. అనంతరం ట్రాక్టర్లను తాడిపత్రి రూరల్ సీఐ సాయిప్రసాద్‌కు అప్పగించారు.

వేధిస్తున్న స్టాంపుల కొరత

గుత్తి మండలానికి చెందిన ఓ వ్యక్తి పట్టణంలో 4 సెంట్ల స్థలాన్ని ఇటీవల కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వెళ్లగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అధికారులు నాన్ జ్యుడీషియల్ స్టాంపులు లేవన్నారు. డాక్యుమెంట్ రైటర్‌ను కలవగా ఈ స్టాంపుల వెండర్ వద్దకెళ్లి స్టాంపులు తీసుకొస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగిస్తామన్నాడు. దీంతో ఈ స్టాంపు వెండర్‌ను కలిస్తే రూ.100 స్టాంపు రూ.1000 అవుతుందన్నాడు. చేసేది ఏమి లేక అధిక ధర చెల్లించి స్టాంపులు కొనుగోలు చేశాడు. మరికొంత దూర ప్రాంతాలకు వెళ్లి నాన్ జ్యుడీషియల్ స్టాంపులు కొనుగోలు చేస్తున్నారు. ఇలా రోజూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

- బ్లాక్‌లో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విక్రయాలు
- ఇబ్బంది పడుతున్న కొనుగోలుదారులు

గుత్తి: గుత్తిలో గత నెల రోజులుగా నాన్ జ్యుడిషియల్ స్టాంప్ (బాండ్లు)ల కొరత వేధిస్తోంది. దీంతో రిజిస్ట్రేషన్‌లకు ఇబ్బందులు తలెత్తున్నాయి. కొనుగోలుదారులు అనంతపురం, పామిడి, వ్యాపిలి, డోన్, యాడికి, తాడిపత్రి తదితర ప్రాంతాలకు వెళ్లి స్టాంప్‌లు తెచ్చుకుంటున్నారు. వ్యయ ప్రయాసలకు తోడు అధికంగా డబ్బు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. కొందరు బ్లాక్‌లో స్టాంప్‌లు విక్రయిస్తున్నారు. రూ. 100 స్టాంప్ రూ.500 నుంచి రూ.1000 దాకా విక్రయిస్తున్నారు. బ్లాక్‌లో, ఇతర ప్రాంతాల్లో స్టాంప్‌లు లభిస్తున్నాయి.



గుత్తిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మరి గుత్తిలో ఎందుకు లభించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో స్టాంప్‌లు అందుబాటులో ఉన్నా గుత్తిలో ఎందుకు ఈ కొరత అనే విషయం ఎవరికీ తెలియడం లేదు. కృత్రిమ కొరతను సృష్టించి వాటిని బ్లాక్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

నెల రోజులుగా తిరుగుతున్నా..



స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించడానికి నెల రోజులుగా రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా. స్టాంప్‌లు లేవని రిజిస్ట్రేషన్ అధికారులు చెబుతున్నారు. డోన్, తాడిపత్రికి వెళ్లి స్టాంప్‌లు తెచ్చుకోవాలని చెబుతున్నారు. చార్జీలు పెట్టి అంతదూరం వెళ్లలేక ఊరకుండిపోయాను. అధికారులు స్పందించి స్టాంప్‌లను అందుబాటులోకి తీసుకురావాలి.

–గోవిందు, పాత కొత్త చెరువు

రూ.100 స్టాంప్ రూ.1000కి కొన్నా..



స్టాంప్‌ల కొరత ఉంది. అయితే బ్లాక్‌లో మాత్రం లభిస్తున్నాయి. రూ. 100 స్టాంప్ రూ. 1000 కు కొనుగోలు చేశాను. మొత్తం 3 వంద రూపాయలవి మూడు వేలు పెట్టి బ్లాక్‌లో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించాను. ఇది చాలా అన్యాయం. అధికారులు స్పందించాలి.

–విశ్వనాథ్ రెడ్డి, గుత్తి అనంతపురం

ఇండెంట్ పంపాం



స్టాంప్‌ల కొరత ఉన్న మాట వాస్తవమే. స్టాంపుల కోసం ప్రభుత్వానికి ఇండెంట్ పంపాం. స్టాంప్‌లు వచ్చాక అందరికీ అందుబాటులో ఉంచి విక్రయిస్తాం. స్టాంప్‌లను బ్లాక్‌లో విక్రయిస్తున్నారనేది అబద్ధం. ఇంతవరకూ నా దృష్టికి రాలేదు. గిట్టని వారు అలా చెబుతుంటారు.

–మంజునాథ్, రిజిస్ట్రార్, గుత్తి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన రమేష్‌రెడ్డి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదల రమేష్‌రెడ్డి సోమవారం బెంగళూరులో కలిశారు. ఈ సందర్భంగా బెంగళూరు నుంచి విజయవాడకు విమానంలో వెళ్తూ పలు రాజకీయ విషయాలపై చర్చించినట్లు రమేష్‌రెడ్డి తెలిపారు. తాడిపత్రి రాజకీయ పరిస్థితులు, అలాగే తాడిపత్రి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారన్నారు.

నేరేడు పండ్లతో బుగ్గ రామలింగేశ్వరుడికి అభిషేకం



తాడిపత్రి రూరల్: పట్టణంలోని పెన్నానది ఒడ్డున ఉన్న పార్వతీమాత సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి అల్లనేరేడు పండ్లతో అభిషేకం చేశారు. జేష్ట త్రయోదశిని పురస్కరించుకుని స్వామివారిని వెండి కవచంతో అలంకరించి అల్లనేరేడు పండ్లతో అర్చకులు రవిశర్మ, మహేష్‌స్వామి అభిషేకించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు

యాడికి: పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం ఆరోగ్యం సాధ్యమని వైద్యులు అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు పరమేశ్వర, సాయి హేమంత్ రెడ్డి, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకూ మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా వ్యాధిని గురించి అవగాహన కల్పిస్తూ యాడికి పుర వీధుల్లో ర్యాలీ సాగింది. అధికారులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించటంతో పాటు ఇంటి పరిసరాల్లో పనికి రాని సామగ్రిలో వర్షం నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాన్నారు. జ్వరం వస్తే వెంటనే మలేరియా పరీక్ష చేయించుకోవడంతో పాటు మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచకపోతే ఉద్యమం



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

గుంతకల్లుటౌన్: మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో కాన్సెల్లుగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్ హెచ్చరించారు. ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం కింద కార్మికుడికి నెలకు రూ.29,200 చెల్లించాల్సి ఉన్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెరిగిన నిత్యావసర ధరల నేపథ్యంలో అతి తక్కువ జీతంతో కుటుంబపోషణ, పిల్లల చదువులు భారంగా మారాయని కార్మికుల ఆవేదన చెందారు. తమకు కనీసం ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందివ్వకపోవడం శోచనీయమన్నారు. సమానపనికి సమానవేతనమివ్వాలని, సంక్షేమ పథకాలు అందివ్వాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్మికులు కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు మస్తాన్, సంయుక్త కార్యదర్శి సురేంద్ర, సుంకన్న పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



గుత్తిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



పెద్దవడుగూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

గుత్తి/పెద్దవడుగూరు/పామిడి/యాడికి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా అన్నారు. గుత్తిలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. రోగాలు దరిచేరవన్నారు. ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలన్నారు.కార్యక్రమంలో సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరులో యోగాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ బారన్‌సాహెబ్, డాక్టర్ శ్రీనివాసబాబు, పంచాయతీరాజ్ ఇంజినీర్ వరప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. పామిడిలో నిర్వహించిన ర్యాలీలో తహసీల్దార్ ఎస్.శ్రీధరమూర్తి, ఎంపీడీఓ కే తేజోత్స్న, ఆయుష్ వైద్యాధికారి కృష్ణవేణి, యోగా ఫ్యాకల్టీ సంధ్యాదత్తు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా యాడికిలో నిర్వహించిన ర్యాలీలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీర్రాజు, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసులు, ఏపీఎం చంద్రశేఖర్,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

గార్లదిన్నె: భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటలు సాగు చేసుకోవాలని రెడ్డిపల్లి శాస్త్రవేత్త జహ్నవి సూచించారు. సోమవారం మండలంలోని కమలాపురంలో వ్యవసాయాధికారులు వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు మొక్కజొన్న, వేరుశనగ, కంది, బత్తాయి పంటల్లో వచ్చే చీడపీడల గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం విత్తనాల లభ్యత, డ్రోన్ ద్వారా మందులు పిచికారి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రఘువరన్, డాక్టర్.ఆంజనేయులు, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



శివ (ఫైల్)

గుంతకల్లు రూరల్: మండలంలోని వైటీ.చెరువు గ్రామానికి చెందిన వెంకటేష్, లక్ష్మీదేవి దంపతుల ఏకైక కుమారుడు శివ (20) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న వెంకటేష్‌కు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు కాగా, ఇదివరకే పెద్ద కుమార్తెకు పెళ్లి చేశారు. పదో తరగతి వరకూ చదువుకున్న కుమారుడు శివ ఆ తర్వాత చదువులకు స్వస్తి చెప్పి వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు చేదోడు నిలిచాడు. ఇటీవల గ్రామంలో చేపట్టిన గృహ నిర్మాణ పనులను శివ దగ్గరుండి పర్యవేక్షించేవాడు. ఈ క్రమంలో సోమవారం గోడలను క్యూరింగ్ చేసేందుకు సిద్ధమైన శివ... మోటార్ వైర్‌ను స్విచ్ బోర్డుకు తగిలిస్తుండగా అప్పటికే నీటిలో తడిచిన ప్లగ్ ద్వారా విద్యుత్ ప్రసారం జరిగి షాక్‌కు గురై మృతి చెందాడు. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య



మహబూబ్ బాషా (ఫైల్)

యాడికి: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికిలోని ఆంజనేయస్వామి కాలనీలో నివాసముంటున్న మహబూబ్ బాషా (56)కు భార్య మాబున్నీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్న ఆయన పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున నొప్పి తీవ్రత తాళలేక ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం నిద్రలేచిన కుటుంబ సభ్యులు గమనించి బోరున విలపిస్తూ చుట్టుపక్కల వారి సాయంతో మహబూబ్ బాషాను కిందకు దించి పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మాబున్నీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నెట్టికంటుడికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కు నగదు అందజేస్తున్న దాతలు

గుంతకల్లు రూరల్: వైఎస్సార్ జిల్లా కలమాల గ్రామానికి చెందిన సింగం మహేశ్వర్ రెడ్డి అనే భక్తుడు తల్లి లక్ష్మీనారాయణమ్మ జ్ఞాపకార్థం సోమవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.

దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు: చిలమకూరు మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో సీట్ల భర్తీకి విద్యార్థుల దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మహేష్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 6 వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో మిగులు సీట్ల భర్తీ కోసం ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బ్లాక్ స్పాట్ల గుర్తింపు

పెద్దవడుగూరు: మండలంలోని 44, 63వ నంబర్ జాతీయ రహదారులపై అధిక ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ స్థలాలను తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాద స్థలాల్లో సూచికలను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. వాహనదారులు రహదారిపై ఏర్పాటు చేసిన సూచికలను గమనిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయడానికి ఎలాంటి ప్రదేశాలు అవసరమో అడిగి తెలుసుకున్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



గుంతకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు



గుత్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



పుట్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

గుంతకల్లురూరల్/గుత్తిరూరల్/పెద్దవడుగూరు/పుట్లూరు/గార్లదిన్నె: పండించిన పంటలు చేతికి అందక అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతన్నను ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతు సమస్యలను పరిష్కరించాలని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతుసంఘం నియోజకవర్గ కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు పండక అప్పుల్లో కూరుకుపోయిన రైతన్న పంటసాగుకు చేతిలో చిల్లిగవ్వలేక దిక్కులు చూస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయాన్ని అందజేస్తామన్న కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ ఏడాది పంటల సాగు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతు సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలన్నారు. 90 శాతం సబ్సిడీతో అన్ని రకాల విత్తనాలు అందించాలని, స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ పెంచి రూ.5 లక్షల వరకూ పంట రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రమాదేవికి అందజేశారు.

▸▸ గుత్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకట్రాముడు, సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, నియోజకవర్గ మహిళా సంఘం అధ్యక్షురాలు మహముదాలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ లలితకు అందజేశారు. సీపీఐ నాయకులు రమేష్‌బాబు, రాజుయాదవ్, నజీర్, నరశింహయ్య, మాబుబ్బి, షఫీ, గోపాల్ పాల్గొన్నారు.

▸▸ పెద్దవడుగూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఉషారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు వెంకట్రాముదుయాదవ్, నారాయణ, ఆదినారాయణ, పోలా రంగస్వామి, సుధాకర్‌గౌడ్, శ్రీనివాసులరెడ్డి, అల్లాబకాస్, ఫక్రుద్దీన్, నాగేంద్ర, మల్లికార్జున, గొర్డలి రాయుడు, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

▸▸ పుట్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. నాయకులు గోపాలక్రిష్ణ, సత్తార్ గోపాల్, చిన్నిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

▸▸ గార్లదిన్నెలో ఏఐవైఎఫ్ నాయకులు రైతు సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. నాయకులు శ్రీనాథ్ చౌదరి, రాముడు, శంకర్, ఓబన్న, కాశీవిశ్వనాథ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రెండు కార్ల ఢీ.. ఒకరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని తలగాచిపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి రెండు కార్లు ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ వైపు నుంచి బెంగళూరుకు వెళ్తున్న రెండు కార్లు సంఘటనా స్థలం వద్దకు రాగానే.. ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి మరో కారు ఢీకొంది. ముందు కారు డివైడర్‌కు తగిలి అవతలి వైపు రోడ్డుపైకి వెళ్లింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు రాక పోవడంతో పెనుప్రమాదం తప్పింది. కారులో ఉన్న ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి.